# కెమేరా

'ప్లీజ్! ప్లీజ్! వొక్క నిముషం అయిపో యింది. కాస్త తలపైకెత్తు. తాపుగా.. కాస్త ఏంగిల్‌లో, మరీ అంత కెమేరా కానషస్‌గా వుండకు, ఆc! స్మైల్! చిరునవ్వు.... అదిగో ఆ పెంకితనపే వొద్దంటూంట!'

గంట వించి సుబ్బలక్ష్మిని నానా చిత్రహింసల పెట్టేస్తున్న రంగరాజ మెళ్ళో కెమేరా కాస్తా ఆమె విసుగెత్తి లేచిపోవడంతో ఫకాలున నవ్వింది!

"ఛస్తున్నా - మీరు శాసించే పోజులు పెట్లేక! బాబూ! మీ ఫొటోకో దణ్ణం - మీకో దణ్ణం - నన్ను విడిచి పెడ్దురూ: కింద పొయ్యిమీద ఎసరెట్టి వొచ్చా."

రంగరాజుకి చిర్రెత్తుకొచ్చింది. కోపాన్ని మదిలి మడతల్లోనూ, కను బొమల్లోనూ బహిర్గతం చేశాడు!

సుబ్బులక్ష్మి జంకింది:

"మర్లేక పోతే ఏవిcటండీ! సూర్యుడు దక్కి పోకముందే డజను ఫొటోలు తీసేస్తా మన్నారు - ఘంటయింది. ఇంకా వొకటీ తియ్యలేమ. అవతల చూస్తే లైట్ ఫేడై పోతోంది. ఇహ చీకట్లో నా తీస్తారు?"

'ఎప్పుడో తీస్తాన్లే - ముందు సరిగ్గా కూచు నేడు.'

'వొచ్చేసింది అబ్బాయిగారికి కోపం, ఇంతలోనే అల కటండీ?' దcయ్‌న వచ్చి అతవి గుండెలమీద వాలిపోయింది సుబ్బులు.

సుబ్బులు జళ్ళోని సన్నజాజులు రంగరాజుని మత్తెక్కించాయి: చల్లని పర్శతో మనిషి క్షణంలో నీరై పోయాడు. ఛప్పున గుండెల్లో అదుము కున్నాడు.

సుబ్బులు గప్పున పరిష్వంగం నించి విడిపోయింది.

"సుబ్బ మా వెనకా చూడకండా ఆ వేషాలేవిcటి? ... ఆ యెదురింటి డాబామీది చూడండి ఎవరున్నారో!'

రంగరాజు వెనక్కి చూశాడు.

ఎదురింటి కాలేజీ కుర్రాడు లావాంటి పుస్తకంలో తలని పాతేసుకున్నాడు! ఇడియట్ చూడనట్టు నటన మళ్ళా! సాయంకాలమప్పుడు ఏ గోదారి గట్టుకో పోకుండా అమ్మాయిల యిళ్ళచుట్టూనో ప్రదక్షిణలు చెయ్యకండా, మహాచదివేసేఘటంలా యింటిని పట్టుకుని దేవుళ్ళాడ్డ మేవిcటో! తన హ్యాపీ జన్మలో - అదే, కాలేజీ జీవితంలో ఇంత అందమైన సంధ్యాసమయాలను ఇలా వేస్ట్ చేసేవాడా!

ఆహాc! ఆ రోజులే వేరు! గోదావరి గట్లమీద నడక! పిల్లగాలులు! అన్నిటికీ మించి వకుళ అదే గట్టు మీద చిన్న ఎస్కార్ట్‌తో వాహ్యాళికి రావటం! ప్చ్: ఆ జీవితమే వేరు! ఆమెతో వొనాడూ మాటాడలేదు. అయితే మటుకు ఆ చిన్నని సన్నని చూపే చాలు - లక్షలు, కోట్లు!

'ఉc, తియ్యండి' అరుస్తోంది సుబ్బులు. క్లియోపాత్రాలో లిజ్ పోజెట్టి! క్లిక్ మని పించాడు, ఒకసారి కాదు! పన్నెండు ఏంగిల్స్‌లో, పన్నెండు శ్నాప్స్!

ఎలాగయినా సుబ్బుల్ది ఫొటోజెనిక్ ఫేస్! పేరు మాత్రం కాస్త బి.సీ వాసన కొడుతునా - ఆ రెండు జడల్లో రెండు సంపెంగలు పెట్టుకుని, చెవులకు రింగుల్తో కొంటె చూపుల్తో, చిలిపి నవ్వుల్తో గలగల నడుస్తూంటే గుండెల్లో భావాల్ని ఏ షెల్లీయో, చలమో పలికించాలిగానీ —

పట్టీలు గలగల మన్నాయి.

ఉలిక్కిపడి వెనక్కి చూశాడు, చేతి కంద లేదు సుబ్బులు. టాటా చెప్పేసి మెట్లు దిగిపోయింది.

ఎన్. ఆర్. నంది

నాటీ గర్ల్! తన కాలేజీలో సుబ్బులు చదువుకోలేదు కాబట్టి, తను అదృష్టవంతుడై పోయాడు గానీ, చదివేవుంటే తనకి మాత్రం దక్కేది కాదు. సీత, వసంత, రమణి, జలజ, వకుళ, సుందరి, రాధ, సుజాత - ఎందరు, ఎందరు, ఎందరు తన క్లాస్‌మేట్స్ తనకి దక్కకుండా, అందకండా పోయారు! బహుశః సుబ్బులు కూడా ఆ జాబితాలోనే చేరిపోయి వుండేది తన క్లాస్‌మేట్ అయివుంటే! బహుశః ఇది దేవుడిచ్చిన శాపమేమో మరి!

సుబ్బుల్ని తలచుకుంటూ, మురిసిపోతూ ఎక్స్‌పోజ్ చేసిన రీల్‌ని చుట్టేసి బయటకు తీశాడు.

యమ కెమేరా: వెధవ, ఆ రామ్‌దాస్ గాడు పోయి పోయి ఏ ఫారిన్‌లో వున్నాడో గాని యమ ప్రెజంటేషన్ ఇచ్చేసి మరీ పోయాడు!

జర్మన్ మేక్! గొప్పగా శ్నాప్స్ తీసి పారేస్తుంది. లైట్ వుండనియ్, లేకపోనియ్. డయాఫ్రమ్ ఎంత చేసినా చక్కని ఫొటోలు లాగేస్తుంది. ఇప్పటికి ఐనారొందల శ్నాప్స్ తీశాడు. ఒక్కటీ ఔటాఫ్ ఫోకస్‌గానీ, బ్లర్‌గా రావటంగానీ, రాంగ్ లైటింగ్ శ్నాప్‌గానీ రాలేమ.

తొమ్మిదొందలు ఖరీదుండొచ్చు. వెధవ సరిగ్గా ధర చెప్పేడవలా! స్మగుల్డ్ గుడ్స్ చవకలో కొనేశానన్నాడు. పెళ్ళిళ్ళలో యింతకంటే మంచి ప్రెజంటేషన్ ఎవరిస్తారోయ్ చూస్తాగా — అని ప్రగల్భాలు పలికాడు.

రంగరాజుకి ఆ కెమేరా అంటే మహా చెడ్డ ప్రాణం. ఐదో ప్రాణమని తెగ అభివర్ణించుకుంటూంటాడు. బొచ్చు కుక్క కంటె, పెంపుడు కొడుకు కంటే కూడా ఎక్కువ మక్కువ అదంటే. ఇతని ప్రేమను లోకువ కట్టేసిందో ఏవిcటో - అది వొక్కొక్కప్పుడు మారాం చేస్తూంటుంది. పక్షవాతం వచ్చినట్టు షట్టర్ బిగుసుకు పోతుంది. హ్రస్వదృష్టి వచ్చినట్టు లెన్స్ ముప్పుకాదు. అల్సర్ రోగం వచ్చినట్టు బెల్లోలో చిల్లులు పడతాయి. అవన్నీ తనే రిపేర్ చేసుకుంటూ చేసుకుంటూ ఎంత నాలెడ్జి సంపాయించేశాడంటే — రిటైరై పోయాక వో



'కెమేరా రిపేరింగ్ హౌస్' పెట్టుకోవాలనే నిర్ణయానికి వొచ్చేశాడు.

మొన్న అకస్మాత్తుగా వో పెద్ద గండం తగిలింది దానికి. అది సుబ్బులు పొరపాటే! అలమరాలో పై అరలో కెమేరా వున్నదని తెలిసుండి గూడా ఏదో వస్తువుని జరున లాగింది. దాంతోబాటు అదికూడా దబ్బున కింద పడింది.

"ఏవిఁటోయ్?" అని కేకేశాడు [illegible]డే.

"ఏం లేదండి" అని తప్పుచేసిన వాళ్లా బిక్కచచ్చి, కేమేరాతో మూలగా నిలబడింది. అతనికి కోపం, కసి హెచ్చాయి.

"ఎంత పన్జేశావ్!" అని చేతుల్లోంచి కెమేరా లాక్కున్నాడు.

"నేను చూళ్ళేదండి."

"వాల్లే" కసిరాడు. ఇంకా కసిగా అరవాలనుకున్నాడు గాని, పెళ్ళయి యింకా ఏణ్ణర్ధం కూడా కాలేదోయ్ అని గుండెల్లోంచి గంటస్తంభం గంటల్లా వార్నింగ్ పుట్టుకొచ్చి ఆగిపోయేడు.

"పొరపాటై పోయిందండీ."

"ఎంత పొరపాటైతే మటుకు, అంత ఖరీదైన వస్తువుని నాశనం చేసుకుంటే మళ్ళా మన యిహ ఈ జన్మలో కొనగలమా?"

సుబ్బులు ముఖం మాడిపోయింది. పొరపాటైపోయిందని మొత్తుకుంటున్నా వూరుకోడేం ఆయన! ఆమె కూడా మంకెత్తుకొచ్చింది.

"అయితే కావాలని చేశానంటారా? నాకు మాత్రం దాని విలువ తెలీదంటారా?"

"తెలిస్తే అంత అజాగ్రత్తెందుకుంటుంది?"

"పొరపాట్లు అజాగ్రత్త వల్లే జరుగుతాయండీ."

"అలాగా!"

రివ్వున లోపలికి వెళ్ళిపోయింది సుబ్బులు.

కేసు తీసి కెమేరాని చూసుకున్నాడు! ఏడుపొచ్చింది. లెన్స్ పూర్తిగా బద్దలైపోయింది. షట్టర్ మీటకి పెరాలిసిస్ వొచ్చేసింది. ఎంత పన్జేశావే - అని కాసేపు యేడుపు ముఖం, కోపం పోజూ పెట్టుకొని కెమేరా తీసుకొని వెళ్ళిపోయాడు.

రోజూ మధ్యాహ్నం ఆఫీసు నించి ఎవరూ చూడకుండా దొంగతనంగా వో ఘంట యింటికొచ్చేసే రొటీన్ అతనిది. ఆవాళ ఆ మార్చరాని దినచర్యకు విఘాతం కలిగింది.

ఆవాళ అతను ఆఫీసుకి తగలడ లేదు. మెళ్ళో కెమేరా వేసుకుని గోదారొడ్డున ఏడుస్తూ కూలబడ్డాడు.

ఆవాళ ఆమె వంటింట్లో పొయ్యిమీదకు గిన్నెల్ని ఎక్కించలేదు. తల విరబోసుకుని పక్కమీద బోర్లాపడి వెక్కి-వెక్కి ఏడ్చింది.

ఆ సాయంకాలం జాజిమల్లెలు యింటికి తీసుకొని రాలేదు.

ఆమె ఆ సాయంకాలం తల దువ్వుకుని చిరునవ్వుల్ని ఒలకబొయ్యలేదు.

(మధ్యలో ఆ ఎదురింటి కాలేజీ కుర్రాడు డాబా మీద కాలు కాలిన పిల్లి మాత్రం అయ్యాడు)

ఆ రాత్రి ఎనిమిదింటికి వో మహా సామ్రాజ్యాన్ని కోల్పోయిన చక్రవర్తిలా వచ్చాడతను.

వచ్చిన మనిషిని - వచ్చారా స్వామీ - అని పాదాలు పట్టుకుని అశ్రువుల్తో అభిషేకం చెయ్యలేదామె!

అతనికి కోపమొచ్చింది.

"చేసింది వెధవ పని - ఇంకా ఎందుకో ఆ అలక" అతని తగ్గని కోపానికి ఉదాహరణగా డైలాగు ప్రారంభం.

"పొరపాటైపోయిందన్నా క్షమార్పణ లేకపోతే ఇంకెలా?" ఆమె నిక్కాయిన జవాబు

ఈ రెండు డైలాగుల మధ్యా టేబిల్ మీది ఇన్లాండ్ లెటర్ రెపరెప లాడింది.

కుర్చీలో కూలబడ్డాడు రంగరాజు చేసేది లేక, నోటమాట రాక. నిశ్శబ్దం భరించలేని అతని మస్తిష్కం చేతులకు ఫర్మానా జారీ చేసింది - వుత్తరాన్ని ఎత్తి చూడమని. దృశ్యేంద్రియాలు మస్తిష్కం మాటను మన్నించి తలొంచుకొని అనుసరించాయి. చేతులు ఎత్తి చూశాయి.

ఉత్తరంలో మూడే ముక్కలు. చచ్చేంత సస్పెన్స్! పట్టలేనంత ఆనందం. సుబ్బులు వేపొకసారి వుత్తరంలోకి మరోసారి చూశాడు.

"అలా అయితే యిక్కడే సీమంతం చేయించాలని మీ నాన్నారు అంటున్నారు. వారం రోజుల తర్వాత ఆయనొస్తారు రంగరాజుని కూడా శలవు పెట్టమను...."

చప్పున లేచాడు:

"నిజమా?" అన్నాడు, దగ్గరకెళ్ళి.

సుబ్బులు ముఖమెత్తి ముఖంలోకి చూసింది. — ఏవిఁటో ఆ నిజమన్నది తెలీక.

ఉత్తరం పడేశాడు.

చూసుకుంది. ఒక నిట్టూర్పు!

అతన్లో ఆగ్రహం, ఆనందం ఆలింగనం చేసుకుని బహిర్గత మయ్యాయి.

"మాట్లాడవేం?"

"ఊఁ" అంది నిజమే అన్నట్టు.

"చెప్పలేదేం యిన్నాళ్ళూ?" కూలబడి కావలించుకున్నాడు.

ఆమె విదిలించుకుని లేచి పోయింది.

"ఇంకా కోపం పోలేదా ?"

"అయ్యో ! నా కోపం ఎవరి మీద చూపించుకోవాలి !"

"యు సిల్లీ ఇడియట్" బుగ్గ మీద చిటిక వేశాడు.

గుండెల్లో నుంచి ఉద్వేగం ఉవ్వెత్తున లేచింది తనూ లేచాడు. వంటింట్లోకి వెళ్ళాడు. పాత ప్రమదావనం కటింగ్స్ దగ్గర పెట్టుకొని నేతి ఉప్మా, సేమ్యా పాయసం కష్టపడి ఎర్రవన్నగానూ, నూకల కూడుగానూ చేసి అమ్మం అంటూ అందించాడు.

ఆవిడ దోక్కుంది తిన్లేక.

నిజవేం నిజవేం అనుకుని ఏడిరిగంతే శాడు.

మర్నాడు బజార్లో కెమేరాని రెంటొంచ లిచ్చి బాగుచేయించాడు.

బాగు చేయిస్తూ బాధ పడ్డాడు ! అయ్యో ! అనవసరంగా సుబ్బుల్ని నానా మాటలూ అని మనస్సు కష్టపెట్టానే వెధవ కెమెరా కూలంగా ! లెన్స్ విరిగిపోతే కొత్తలెన్స్ వేయించుకో గలిగాడు. కాని ఆమె మనస్సు విరిగింది. రిపేర్ వేయగలడా ?

ఏవిటో తన యిరిగాసీ, ఆలు మగల మధ్య తగూలాట ఎంతసేపు ? నీటిమీద గీత వున్నంతసేపు వుండదు. ఆ విరిగి పోయిన మనస్సుని బలంగా సెల్యూషన్ వేసి అతకడం అతని కంత కష్టం కాదు. ఒక పన్నెండు పైసల జాజిపూలు; ఇరవై రూపాయల చీర! అల్పసంతోషి పాపం సుబ్బులు. బియ్యే చదివిందిగానీ అహం, గర్వం ఏ కోశానాలేవు. దురదృష్టం కాక పోతే ఆ మెకు ఏ ఐ. ఏ. ఎస్. వాడో గాకండా తనలాంటి యూకీసీగాడు దొరకడ మేమిటి ?

వో మూలగా అతన్లో అంతరాత్మ గోల మొదలెట్టింది : నీ కేమిటయ్యా తక్కువ ? అందమా ? చదువా ? సంపాదనా ? ఏవిటి నీకో తక్కువని ఆమె సుందర మవ్వంత తీసికట్టుగా మాటాడుతున్నావ్ !

అవున్నిజవేం ! అర్థం చేసుకోవాలి గానీ ఆలుమగల మధ్య ఈ డిగ్రీలు ఖాతాలు కావుగా ! పైగా తనో రచయిత. తన రచ నల్ని సుబ్బులు ఎంతగా మెచ్చుకుని, మురిసిపోతూంటుంది !

అదే కోటి పాఠకుల ప్రశంసలు ! కోటి కోట్ల యోగ్యతా పత్రాలు. అందు కోసవేం ఆ తర్వాత ప్రతీ నెలా జీతం అందగానే ముందొక రీల్ కొనుక్కొచ్చి పన్నెండు శ్నాప్స్ తీసి పారేశాడు. ఫొటోల్లో ఎంత అందంగా అగుపించేది !

మర్నాడు ఆఫీసునించి రెండుగంటలు ముందుగా వచ్చేశాడు. దార్లోనే స్టుడియో కెళ్ళి నిన్న తీసిన పన్నెండు ఫొటోలు తీసుకున్నాడు. అత్యద్భుతంగా వచ్చాయి. ఒకే అందం పన్నెండు ఫొటోల్లోనూ పన్నెండు రకాలుగా మెరిసిపోతోంది ! చీరెలకట్లల్లో పన్నెండు రకాల ఇంద్ర ధనస్సులు. ఆడాళ్ళు యిలాంటప్పుడే చాలా అందంగా కనిపిస్తారని ఓళ్ళు గారవుని ఉవాచ. నిజానికి ! తన సుబ్బులు ఎప్పుడూ లావణ్య మూర్తే !

సరిగ్గా యింటికొచ్చే సరికి యింట్లో నుంచి ఎదురింటి ఓపంథామయ్యగారి పనేళ్ళ పుత్రరత్నం చేత్తో పత్రికల్తో బయటకు వస్తున్నాడు.

"ఏవయ్యో, సత్తా, పత్రిక లెవరి చ్చారు ?" అన్నాడు.

"ఆంటీగారు తీసుక రమ్మన్నారండి."

"ఏదెవరు ?"

"డాబా మీద వుంటున్నారండి."

రంగరాజు ఛప్పున వెనక్కి చూశాడు. డాబామీద టాంకీ దగ్గర వో ఆకారం గప్పున కరిగిపోయింది.

కాలేజీ కుర్రాడా ! అతని దగ్గర్నుంచి పత్రిక లెందుకు తెచ్చుకోవడ మెందుకు ? లోపలికెళ్ళాడు.

సుబ్బులు వంటింట్లో కుంపటి రాజే స్తోంది.

"మీరా ! అంది గతుక్కుమని. అక స్మాత్తుగా వచ్చేసిన రంగరాజుని చూసి.

"నీకు పత్రికలు చదవాలని వుందా ?" అన్నాడు రంగరాజు.

అతని వైపు చిత్రంగా చూసింది సుబ్బులు. ఏమయిందో తెలుసుకోలేక క్షణంసేపు మాటాడలేదు.

"అలా అరువుతెచ్చి చదవడం మంచిది కాదు. రేపట్నుంచి చందా కడతాను. కావల్సిన పత్రిక లన్నీ యింటికే వస్తాయి."

ఆమె సన్నని నిట్టూర్పు రంగరాజుకి వెచ్చగా వినిపించింది !

ఫొటోలు టేబుల్‌మీద పడేశాడు. కాలేజీ అబ్బాయి మీదికి పోయింది అతని ధ్యాస.

"పిల్లేమ ! అలా జరక్కూడదు ! అత నికి సన్నని వార్నింగొకటి పడెయ్యాలి" అను కున్నాడు.

ఛప్పున అతనికి దానవాయి పేటలోని సావిత్రి జ్ఞాపకానికి వచ్చింది. పెళ్ళికాక ముందుమాట ! ఆవిడ కాపరం చేసు కుంటూండేది. బాగా చిన్నప్పుడే పెళ్ళయి పోయినట్టుంది - పద్దెనిమిదేళ్ళున్నయ్యో లేవో నాలుగేళ్ళ బుడత దొకడున్నాడా మెకు. భర్తకు మునిసిపల్ ఆఫీస్‌లో చిన్న వుద్యో గం. పాపం ! ఆమెకు పత్రికలు చదవాలనే తహతహ ! కొనుక్కుని చదివే తాహతు లేదు వొకసారి కొడుకుతో కబురంపింది ; పత్రిక లేవన్నావుంటే పంపమని. రెండి చ్చాను. అలానే కొన్నాళ్ళిచ్చాను, అదో దిన చర్య అయిపోయింది ! ఇహ తను ఆమె కోసమే పత్రికలు కొనడం అలవాటు చేసు కున్నాడు. చాలాచాలా కొనేవాడు. ప్రతి పేజీలోనూ తనపేరు రాసేవాడు.

"ఇందులో నా కథ పడింది, అమ్మ చదివిందా ?" అనేవాడు బుడతడుతో.

ఆమె తనకథ చదివితే తన కొరిగే దేవిటో ? ఆమెనించి తనేవన్నా కాంక్షి స్తున్నాడా ? సరిగ్గా నిర్ణయించుకోలేదు. ఆమె అందంగానే వుండేది. బుగ్గల్లో పేదరికపు చిహ్నాలు కొట్టొచ్చినట్టు కనిపించినా నవ్వితే చాలు నవ వసంతాలు విరిసేవి తనలో. ఎందుకో !

ఒకసారి తనని చూసి నవ్వింది. మరో సారి వూరికే నవ్వింది. మరోప్పుడు ఎందుకో నవ్వింది. నవ్వులో గలగల విని పించేది తనకి. గుండె లయ తప్పేది.

ఒకసారి ఆమె తనగది దగ్గరకు వచ్చింది. పత్రికల కోసం అనుకున్నాడు. మిట్ట మధ్యాహ్నం. రోళ్ళు పగిలే రోహిణి కార్తె ! ఉక్క. ఆవాళ ఆఫీసుకి శలవుపెట్టి యింట్లో కూచున్నాడు. కూచుని కొత్తకథ కోసం కుస్తీలు పడుతున్నాడు.

గాజుల చప్పుడికి వులిక్కిపడి వెనక్కి చూశాడు..

***

Phone : 3692

Grams : Kagh[a]z

Please contact

Nadella Suraiah & Co,

Samarangam Chowk,

VIJAYAWADA-1.

For

Any varity of quality papers & Boards of.

The Sirpur PaperMills Ltd., Sirpur Kaghaz nagar (A.P)

Orient paper Mills Ltd; Brajhajnagar (Orissa)

Orient Paper Mills Ltd; Amlai(M.P)

***

సావిత్రి !

ఆమె నవ్వింది. అదే నవ్వు. గుండెల్లో శూలపోట్లు, కళ్ళల్లో వొణుకు, నరాల్లో నీరసం.

"అబ్బ ! ఎంత చల్లగా వుందండి మీ గదిలో !" అంది ఆమెపైన తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ వైపు, తనవేపూ కత్తుల్లాంటి చూపుల్ని విసుర్తూ.

ఆడాళ్ళు అపరిచయస్తుల్తో యింత ధైర్యంగా మాట్లాడ గలుగుతారని అతనికి అనుభవంలో ఏనాడూ తగలని అనుభూతి. ఆమె వేపు విచిత్రంగా చూశాడు. ఆమెచీర చెంగుతో ముఖం అద్దుకుంది - కావాలనే లాగుంది. జారిన పైట వెనకనుంచి స్పష్టంగా కనిపించిన వక్షోజాలు !

ఆమె దగ్గరగా వచ్చింది.

"మీ కథలు చాలా బావుంటాయండి" అంది ఆమె.

అతనికి ఒళ్ళంతా చెమటా వొణుకూ మొదలయింది. ఎముకల్లో చలి, వంటి మీద స్వేద స్రవంతి.

ఆమె నవ్వింది. నవ్వుతోంది - తన పిరికి తనానికి.

ఆమె మరింత దగ్గరగా వచ్చేసింది. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఆమె వక్షస్థలిలో సముద్రపు ఆటుపోట్లు !

అతని వొళ్ళు వొక్కసారిగా జలదరించింది. అనుభవంలో లేని వింతస్పర్శ. అతను కంపించి పోయాడు ! అంతే !.... అంతే !

"వీల్లేదు" అంటూ ఘట్టిగా అరచుకున్నాడు. "అలా జరక్కూడదు !" — అరుస్తూనే వున్నాడు.

వంటింట్లోంచి సుబ్బులు పరుగున వచ్చింది ఏమిటి అనుకుంటూ.

పిచ్చి చూపుల, నిలువు దృష్టితో ఆయాస పడిపోతున్నాడు రంగరాజు.

"ఏమిటయిందండీ ? ఎందుకలా గావుకేకలు పెట్టారు ?"

అతను సమాధానం చెప్పలేదు. గుండెల్లో ఏదో మంట. చెప్పుకోలేని బాధ ! చప్పున నిలబడి ఆమెను కావలించు కున్నాడు.

"లక్ష్మీ ! నన్ను అన్యాయం చెయ్యవు కదూ ? చెయ్యవు కదూ ?" ఆమె కేశాలనూ, ఫాలాన్నీ, నాసికనూ, వాతెరలనూ పిచ్చిగా వెర్రిగా స్పృశించ నారంభించాడు.

అతని రెండు కళ్ళనించీ కన్నీళ్ళు. ఘాటిగా అరుస్తూనే వున్నాడు "సుబ్బులూ ! నన్ను అన్యాయం చెయ్యకు !"

అతన్ని మెల్లగా విడిపించుకుని పరుపు మీద కూచోబెట్టింది. ఎప్పుడూ లక్ష్మి అని పిలవని వింత సంబోధన ! ఏమిటీ అన్యాయం చెయ్యకపోవడం ? ఎవర్ని అన్యాయం చెయ్యక పోవడం ? పగటికలలా ? ఛీ ! ఏమిటీయన మరీ చిన్నపిల్లాళ్ళా !

ఓ పావుగంట తర్వాత అతను తేరుకున్నాడు. ఇంతవరకూ ఏం జరిగిందో అతనికి అనూహ్య మయింది. ఏదో అభయాన్ని తన అర్థాంగి నుంచి అర్థించినట్టు లీలగా గుర్తు. ఆమె చేతుల్లో తన చేతులు తన గుండెల్లో ఆమె తల.

"కల కన్నారా ?"

తలూపాడు.

"తెలవారంతీ - కలవరింతల్లో హడలగొట్టి చంపేశారు ! ఉండండి కాస్త వేడి వేడి కాఫీ తెస్తా"

ఆమె గలగలా వెళ్ళిపోయింది.

తన సుబ్బులు తనకి అన్యాయం చెయ్యదు. ఆ సావిత్రితో సుబ్బుల్ని పోల్చుకోవడమేమిటి పూల్లా ! తన దగ్గర చదువూ, సంస్కారం, అందం, హోదా - అన్నీ వున్నాయి. సావిత్రి భర్తలో దాదాపు అన్నీ శూన్యమే ! అందుకే సావిత్రి అవాళ అలా తనని తాను సమర్పించుకుందా తనికి ఏమో ! స్త్రీ హృదయం సర్వేశ్వరుడికే అర్థం కాదు. మానవ మాత్రుడు తనకి అర్థమవుతుందా ?

సావిత్రి చేసినట్టు సుబ్బులు చేస్తుందా ? ఆ కాలేజీ కుర్రాడింటికి సాహసించి వెడుతుందా ? ఛి ఛి ! పాడు ఆలోచన్లు. వెధవ నీచాభిప్రాయాలు ! సుబ్బులు గురించి తనలా వూహించు కోవడమే వో మహా పాతకం ! ఈవాళ తనసలు ఆమె గురించి అంత తక్కువగా ఎందుకు భావించుకుంటున్నాడు ? .... కాలేజీ కుర్రాడికి ఆ తన్న టి వార్నింగోటి పడెయ్యా లనుకున్నాడు.

రెండ్రోజుల తర్వాత, వో పన్యాహ్నం కిళ్ళీకొట్టు దగ్గర కాలేజీ కుర్రాడ రంగరాజుకి తారసపడ్డాడు. అతన్ని చూడగానే తీసుకుంటున్న సిగరెట్లు మానేసి రోడ్డు దారి పట్టించాడు. రంగరాజు అతని వెనకాలే వచ్చాడు.

"బ్రదర్, మీరు కాలేజీలో చదువుకుంటున్నారా?" అన్నాడు.

"అవునండి"

కొంతదూరం నిశ్శబ్దంగా మిలిట్రీ పెరేడ్.

"మీ పేరు ?"

"మధు"

ముందుగానే వుందనుకున్నాడు రంగరాజు.

"స్వగ్రామం ?"

"పెంటపాడు"

"బాగా పల్లెటూరే!"

మధు తలూపాడు,

పాపం! పల్లెటూరి పిల్లాడు. ఇంకా పట్నవాసపు వాసన్లూ, పోకడలూ తెలీవు. బాబా మీద రోజూ సాయంకాలం తిగడాలు నిజంగా చదువుకునేందుకే నేమో? పల్లెటూరివాళ్ళు చాలా అమాయకులు. ఇతన్లో కూడా అమాయకత్వపు చిహ్నాలు కనుపిస్తున్నాయి. తనే తప్పుగా వూహించుకున్నాడన్నమాట! మనస్సు ఎంత కోతిది! మంచు ముద్దనుచూసి అగ్నిశిఖలా భ్రమింపచేసి జడుసుకునేట్టు చేసింది!

ఎంత పల్లెటూరివాడైనా లోపల ఓ అగ్నిపర్వతం అంటూ వొకటి వుంటుంది. ఎందుకైనా మంచిది షాక్ టాక్ ట్రిక్స్ ఉపయోగిస్తే?

"బ్రదర్! మీరు చాలా దూరం నించి చదువుకోడానికి వచ్చారు. బాగా చదువుకుని క్లాస్ తెచ్చుకోవాలి. చెడుసావాసాలు చేస్తే మీ వాళ్ళు ఖర్చు చేసిన డబ్బు దండగవుతుంది, మీరూ వృద్ధిలోకి రాలేరు. మన వీధి కాస్త గడుగ్గాయలకు ప్రసిద్ధి. మీరు ఏమాత్రం పొరపాట్లు చేసినా మీకే ప్రమాదం. ముఖ్యంగా స్త్రీల విషయంలో—"

రంగరాజు ఆ మాటలనేసి వెళ్ళిపోయాడు. అన్నదమ్ముల బరువు దించిన తృప్తి కలిగింది. ఒకవేళ ఆ అబ్బాయిలో ఆడవాళ్ళ గురించి విషబీజాలంటూ వుంటే



వుంటే అవి ఈ దెబ్బతో సమూలంగా నాశనం అయిపోయి వుండాలి అనుకున్నాడు రంగరాజు.

జీతాలందాయి. ఈ నెల కొత్త ఫొటోలు తీసే బదులు పాత ఆల్బంలోని ఫొటోలన్నిటిని మళ్లా ప్రింట్స్ తీయించి కొత్త ఆల్బమ్స్‌లో అతికించుకోవాలనుకున్నాడు.

"ఎందుకలా డబ్బు తగలెయ్యడం." అంది సుబ్బులు.

"సరదా"

"సరదా కన్నా హద్దూ పద్దూ వుండాలి. ఆ కెమేరా మీద యిప్పటికే మూడు నాలుగొందలు తగలేశారు. ఆ ముక్కుమాలిన కెమేరాకి ఎప్పుడు చూసినా రిపేర్లే"

"రిపేర్లొస్తున్నాయని పారేసుకుంటామా?" అన్నాడు రంగరాజు.

"చిన్న చిన్న రిపేర్లయితే ఫర్వాలేదు. మొన్న లెన్స్ పోయిందిగా. నా అజాగ్రత్తల్లే అనుకోండి – లెన్స్ పోతే ఇహ అది ఎందుకూ పనికి రానట్టే కదా? మళ్ళీ దానికంత ఖర్చుచేసి కొత్తది వేయించారు. ఎంతయినా పాతలెన్స్ అంత క్లియర్‌గా దీంతో ఫొటోలు వస్తున్నాయా?"

"ఎందుకు రావటం లేదు? మొన్న దాబామీద తీసినవి ఎంత బాగా వచ్చాయి!"

"అది మీ భ్రమ. పోనీ లెన్స్ పోనే పోయిందిగా, దానో్నమూల పారేసి కొత్తదొకటి కొనుక్కోరాదూ? ఎంత కని ఆ పాతదాంతో దేవులాడుతారు?"

"ఓల్డీజ్ గోల్డ్ అన్నారు"

"మీ పిచ్చి మీది. సరే మీ యిష్టమే. కానిచ్చుకోండి..మధ్య నాకేం పోవాలి?" అని గిర్రున లోపలికి వెళ్ళిపోయింది.

రంగరాజు నవ్వుకున్నాడు.

మూడు రోజులూ ఫొటోగ్రాఫర్ పీక మీద కూచుని పదిహేను ఆల్బమ్స్ పాత నెగిటివ్‌లతో మళ్ళా కొత్త ఫొటోలు ప్రింట్ చేయించి నీట్‌గా తయారు చేసుకున్నాడు. వాటి నన్నింటినీ చూసిందే చూసుకుంటూ మురిసిపోయాడు. సుబ్బులు వీటన్నిటినీ చూసుకుని ఏవంటుందప్పుడు? డబ్బు నష్టప్రయోగం అయిందంటుందో లేదో!

మధ్యాహ్నం షార్ట్‌లీవ్ తీసుకుని ఆల్బమ్స్‌తోబాటు హుషారుగా విజిలేసుకుంటూ యింటికి వచ్చాడు. మెళ్ళో వేలాడుతున్న కెమేరాదే ఆ క్రెడిట్ అంతా! పెదనాన్న రామ్‌దాస్ గారు పోయి పోయి ఏ ఫారిన్‌లో వున్నాడోగాని యిది ప్రెజంటేషన్ యిచ్చి పోయాడు!

ఇంటి కొచ్చేసరికి తలుపులు దగ్గరగా వేసివున్నై. సుబ్బులు బహుశః నిద్ర పోయి వుంటుంది. లేపకూడదనుకున్నాడు. అకస్మాత్తుగా ఈ ఆల్బమ్స్ చూపించాలనుకున్నాడు. తలుపు దగ్గర కు నిశ్శబ్దంగా వచ్చాడు. తలుపు తోశాడు. లోపల్నుంచి గడియవేసుంది.

తలుపు సందుల గుండా చూశాడు. పరుపు మీద సుబ్బులు లేదు. కుర్చీమీద టేబిల్ ముందు కూచుని వుత్తరం రాసుకుంటోంది. వాళ్ళమ్మకు రాగుంది. ఏదో నెలవచ్చేస్తోంది. ఎప్పుడొచ్చి తీసుకెళ్తారని లాగుంది కంగారు.

మెల్లగా తట్టాడు.

"ఎవరూ?"

సమాధానం చెప్పకుండా మళ్ళీ తట్టాడు.

ఆమె ఉత్తరాన్ని, కలాన్ని టేబుల్ మీద విడిచిపెట్టి, వచ్చి తలుపు తీసింది.

ఆమె ముఖం పాలిపోయింది. గతుక్కుమంది. నోట మాట లేదు. గుటక వేసి మెల్లగా అంది:

"మీరా?"

"అవును నేనే!" – అనుకుంటూ రంగరాజు లోపలికొచ్చాడు. "ఎవరికి వుత్తరం?"

"ఏ ఉత్తరం?"

"ఇప్పుడు రాస్తున్నావ్‌గా?"

ఆమె కంగారుగా టేబిల్ వేపు చూసింది.

"మీ అమ్మకా?"

తలూపింది.

"ఏమిటి – అప్పుడే పుట్టింటికి చెక్కేద్దామనే?" – అతను టేబుల్ దగ్గరకు వెళ్ళాడు.

సుబ్బులు పరుగున వచ్చి వుత్తరాన్ని తీసేసుకుంది.

"నేను చూడకూడదా?"

ఆమె మాటాడకుండా వుత్తరాన్ని నలిపేసింది.

"అదేమిటలా నలిపేస్తున్నావ్ – పోన్లే నే చూడన్లే"

ఆమె వినిపించుకోలేదు. మరింత బలంగా పిడికిలి బిగించి నలిపేసింది.

ఆ తరుణీ మణి చేతుల్లో నిష్కారణంగా నలిగిపోతున్న లేఖను రక్షించాలనిపించింది రంగరాజుకి. గభున ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు.

ఆమె పట్టు విడవలేదు. మరింత కసిగా పిడికిలి బిగించేస్తోంది.

అతని క్కోపం వచ్చి బలవంతంగా పిడికిలి తెరిపించి వుత్తరాన్ని లాక్కున్నాడు.

"అంత సిగ్గయితే ఎలా? మీ అమ్మకు రాసుకున్న వుత్తరాన్ని చూస్తానంటే అంత భయమా?"

అతను నలిగిపోయిన వుత్తరాన్ని మెల్లగా విప్పాడు!

ఆమె గిర్రున తిరిగి లోపలికి వెళ్ళి పోయింది!

ఉత్తరంలో అక్షరాలు ఎంతో ముద్దుగా, సుందరంగా, అందంగా వున్నాయి. సుబ్బులు యింత ముద్దుగా రాయగలదా? ఎంతయినా పుట్టిల్లు పేరు చెబితే చాలు ఆడ పడుచులకు ఆ ఆనందం, ఆ వుత్సాహం ఎంత ఉవ్వెత్తుగా వచ్చేస్తుందో మరి!

ఏమని రాసిందో?

కాగితాన్ని మడతలు లేకుండా చేసి చదవ మొదలుపెట్టాడు:

"మధూ!"

గతుక్కుమన్నాడు రంగరాజు. ఈ మధెవరు? సుబ్బులు అన్నగారి పేరు సుందరం. మరీ మధు ఎవరు? ఉత్తరాన్ని గబగబా చదివేశాడు.

ఏమిటి చదువుతున్నాడో అతనికే తెలీని అయోమయం! మొదటి రెండు వాక్యాలకూ అతని తల తిరిగిపోయింది. ఎదురుగా చక్రాలు తిరుగుతూ చీకట్లు! చెవుల్లో రొద! గుండెల్లో గగ్గోలు! పొడిపొడిగా చదివేశాక వొళ్ళు వుడుకున! చదివేశాక వొక్కసారిగా కూలబడి పోయాడు!

అంతా అయోమయం! ఎటు చూస్తే అటు



చీకటి! వీకటొట్ల పసాలు! లేవిడీలు! కూతలు!

అతను ఏం చేస్తున్నాడో గుర్తించకునే లోపునే అతను వంటింటి ద్వారం దగ్గర వున్నాడు.

సుబ్బులు ఆరిపోయిన పొయ్యి ముందు కూచుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఈమెనేగా ఈ క్షణం వరకూ సుగుణాల రాసిగా, అందాలరాసిగా వూహించుకని మురిసి పోయింది! ఆ అందం వెనక యింతటి మాలిన్యం! వంచన! తనని అడ్డం పెట్టుకొని యింత నాటకం ఎందు కాడవలసి వచ్చింది? ఎప్పుడో, ఏనాడో యవనిక తొలగి నేపథ్యంలోని జీవితం నగ్నంగా కనిపించినపుడు ఏమని సమాధానం చెప్పాలనుకుంది సుబ్బులు?

"నన్ను అన్యాయం చేసేశావ్ సుబ్బలక్ష్మి! అన్యాయం చేసేశావ్!" పొడిగా ఏడ్చాడు.

ఆమె తలెత్తలేదు. సన్నగా ఏడుస్తోంది. పశ్చాత్తాపమా? ముందు కాళ్ళకు బంధనా?

అతనేం మాటాడలేదు. మాటాడుకోలేక పోయాడు.... ముక్కలైపోయిన గుండెను మోసుకుని కెమేరా, ఆల్బమ్ని తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

చీకటి పడిపోయింది. గోదారోడ్డు దగ్గర నిర్మామష్యంగా వుండే సిమెంట్ బల్లమీద రంగరాజు శిల్పలా కూచున్నాడు.

ఈ సుబ్బులక్ష్మిని తనేం చేసుకోవాలిప్పుడు! మానవుడు క్షమించలేని తప్పు చేసిందే! క్షమించి స్వీకరించాలా? కోపించి తిరస్కరించాలా?

ఎలా తిరస్కరించ గలడు? ఏణ్ణర్థం తనతో కలిసిమెలిసితిరిగిన జీవనసహచారిణి! ఏ మనిషికీ ఏర్పడని స్నేహం సాన్నిహిత్యం యేర్పడింది! ఒక్క క్షణంలో ఆ అనుబంధాల్ని, అనురాగాల్ని ఎలా తెంచేసుకో గలడు? తెంచుకొని తను బ్రతక గలడా?

ఎవరో వెన్ను చరచినట్టయింది! సావిత్రి జ్ఞాపకానికి వచ్చింది. తనకి సావిత్రి తనని సమర్పించుకో లేదా? తను మాత్రం అప్పుడు జరిగిన తప్పులో భాగస్వామి కాలేదా? సావిత్రిని మొదట్లో అర్ధంగికా, తర్వాత అవసరం కొద్దీ కోరకోలేదా? సావిత్రి భర్తకు ఆ సంబంధం తెలిసి వుంటే? తెలీక, పాపం, ఆ సావిత్రిని అతను సుగుణాలరాశిగానే ఆరాధించు కోవటం లేదా? తెలిస్తే ఏమైపోయేవాడు అతను? తనలా పిచ్చెక్కిపోయేవాడా? నవ్వుకొని చూసీ చూడనట్టు వూరుకొనే వాడా?

ఎలా వూరుకో గలడు తను ఈ సుబ్బలక్ష్మి విషయంలో? తన సర్వస్వం అని భావించుకున్న మనిషి తనని మోసం



చేసిందే! ఆ మోసాన్ని నువు భరించగలవా? క్షమించగలడా? భగవాన్! ఎందుకింత లాంటి ముళ్ళ కంపల్ని నా జీవితంలో పరిచావ్? సావిత్రికి చేసిన అన్యాయానికి ప్రతీకారమా?

ఎదురుగా నదీ మళ్లీ నవ్వుతోంది.

ఎందరు పాపుల్నో నువ్వు చూసివుంటావ్! అందరికీ యిలాంటి శిక్షన్నే విధిస్తున్నావా తల్లీ? వాళ్ళు యిలా రక్తాశ్రువులు కారుస్తూ వుంటే కెరటాలు యిలానే కొట్టావా?

మెల్లగా ఆల్బమ్స్ పుటలు తిప్పాడు. ఒక్క ఫొటోలోనూ సుబ్బులక్ష్మి అందంగా లేదు. ఒకదాంట్లో ముగ్గుబుట్టలా తల! మరో దాంట్లో కళ్ళు లేవు! మరో దాంట్లో ముఖమే శూన్యం. మరో ఫొటోలో మనిషే లేదు! ఇన్నాళ్ళూ కెమేరానూ తనని మోసం చేస్తూ వచ్చిందా?

ఛప్పున కెమేరానీ, ఆల్బమ్‌లనీ గోదార్లోకి విసిరేశాడు.

గుండె భారం సగం తగ్గిపోయింది.

పరిష్కార మార్గం కనిపించింది. వాళ్ళద్దర్నీ ముక్కలు ముక్కలుగా నరికెయ్యాలి. అవును అదే పరిష్కారం.

గప్పున లేచాడు.

చొక్కా సిమెంట్ కుర్చీ యినప గొలుసు తగిలి, లేచినట్టే కూలబడిపోయాడు. ఎవరో ఆగమన్నట్టనిపించింది. ఎవరు తనని శాసించేది? ఎవరికా హక్కువుంది

ఎవరికో ఆ హక్కువుంది. ఎవరో తనని శాసించగలరు.

ఆ "ఎవరు" ఎవరు?

సావిత్రి కళ్ళల్లో గాలంలా మెదిలింది ఆమె భర్తకా హక్కువుంది. ఆనాడు అతను కూడా తనప్పుడు నిర్ణయించుకున్న పరిష్కార మార్గాన్నే వూహించుకని వుంటే తనూ సావిత్రీ యిప్పుడు ఏ లోకాల్లో వుండేవారో! అతనా హక్కుని - అసలు విషయం తెలీక - వుపయోగించుకోలేదు

తెలిశాక తను వుపయోగించ వూనుకుంటున్నాడు.

పరిష్కారాలు ఒక్కొక్కరికి వొక్కొక్క విధంగా వుంటాయా?

కాని సుబ్బులు పతనమయిపోయింది. నైతిక పతనం. మనిషి నాగరిక సమాజంలో దిగజారిపోగూడని అగాధాల్లోకి దిగజారిపోయింది. అక్కడ పడిపోయిన వాళ్ళకు విష్కృతి లేదు. పునర్ వ్యవస్థీకరణ వుండదు. నైతిక పునరుద్ధరణ లేదు.

ఎందుకు లేదు?

పాడైపోయిన కెమేరాని తను బాగు చేసుకోలేదూ? కెమేరా— ముఖ్యంగమైన లెన్స్ బద్దలై సర్వనాశనమైపోతే తను దాని స్థానే కొత్తది వేయించి కెమేరాని వుపయోగించుకుంటున్నాడే!

సుబ్బుల్ని తను "రిపేర్" చేసుకుని స్వీకరించలేడా?

ఎక్కడ అచేతనమైన కెమేరా! ఎక్కడ సజీవ ప్రాణి సుబ్బులక్ష్మి? రెండింటికి పోలికేంటి?

ఎందుకు లేదు? పాడైపోవడమనే క్రియ చేతనానికీ, అచేతనానికీ వొకటే. అయితే వొకదాన్ని స్వీకరించి, మరోదాన్ని తిరస్కరించటంలో సమదృష్టి లోపించలేదా?

లేదు! లేదు! లేదు!

దూరంగా తాణాలో పన్నెండు ఘంటలు నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చాయి.

రంగరావు మెల్లగా మెట్లు దిగాడు.

కాళ్ళకు చల్లగా అలలు తగిలాయి.

"నన్ను క్షమించు తల్లీ!"-అని ఒకే గెంతు గెంతాడు.

కింద కాళ్ళు ఆనలేదు. ఎక్కడికో దిగిపోతున్నాడు. అధఃపాతాళానికి క్రుంగిపోతున్నాడు. పరిష్కారం యిదే అనిపించింది. నోర్మూసుకుని చావు-అన్నట్టు నోట్లోకి నీళ్ళు ప్రవేశించాయి.

అతనికి శ్వాస అందలేదు తను చచ్చిపోతున్నాడు వూహల్లోకి కూడా చెవులకు సోకనివ్వని మృత్యుశబ్దం కోటికోట్ల కంఠాలతో గింగుర్లెత్తింది.

"నేను చావను. చావలేను. చావకూడదు" అని అరిచాడు.

అతని కాళ్ళకు ఏదో చుట్టుకుంది యమధర్మరాజు పంపించిన పాశమా అది! ఆఖరికి నేను పోయేది నరకానికా? అని ఏడ్చాడు. ధర్మదేవతను కడసారిగా ప్రార్థించుకున్నాడు. "భగవాన్! నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావా స్వామీ!" అంటూ.

"లేదు లే" అంటూ వో పెద్ద అల అతన్ని వొడ్డుకి విసిరి కొట్టింది.

అతనికి స్పృహలేదు. వొచ్చేటప్పటికి రాణా లోంచి రెండుగంటలు వినిపించాయి.

లేవబోయాడు. ఏ అంగం తన అధీనంలో లేదు కడుపులో శూలాలు; గుండెల్లో గునపాలు. వూపిరి భారం; ఛాతీలో పోటు. క్షణం అలానే మెట్లమీద సోలిపోయాడు.

మెల్లగా లేచాడు. కాళ్ళకి ఏదో చుట్టుకుంది. వంగి విడిపించుకున్నాడు. కెమేరా తోలు బెల్ట్!

తన ఆయిదో ప్రాణం!

గోదావరి గలగల నవ్వింది.

"ఇది నీ చలవా తల్లీ? నాకు అంతరాదు. ఇక్కడ లోతు తెలీదు. విసిరేసిన కెమేరాను కాళ్ళకి తగిలించావ్! ఇది నీ శాసనమా తల్లీ?"

అల విరుచుక పడింది. ముఖాన నీటి తుంపరల చిలకరింపు.

"ఆశీస్సులా తల్లీ? కెమేరా పునీతమయిందా? స్వీకరించాలా?"

దూరంగా మెరుపు. వెనువెంటనే ఘీంకారం. దిక్పాలకుల దీవనలా?

"సుబ్బులక్ష్మిని స్వీకరించాలా? అందుకే చావాలనుకున్నవాణ్ణి, కొట్టి బయటకు పంపించావా?"

మరో మెరుపు.

లాభంలేదు. వెంటనే యింటికి పరుగెత్తాలి.

సుబ్బులు ఏ శ్చేడ్చి మూర్ఛపోయి వుంటుంది. స్పృహ తప్పిన కళేబరానికి ఎవరు సపర్యలు చేస్తారు?

"వస్తున్నా సుబ్బులూ! వస్తున్నా—" అని పిచ్చిగా అరచి పరుగెత్తాడు.

ఇంట్లో చీకటి. దీపం లేదు. పిలిచాడు. ప్రతిధ్వని. అరిచాడు. ఘోరమైన నిశ్శబ్దం. దూరంగా ఆ కేకకి ఝడుసుకున్న శ్వాన మహర్షి ఆవులించి, ఆలాపించింది. శ్రుతి కలిపాయి మిగతా సోదర బృందం.

పిచ్చిగా యిల్లంతా వెదికాడు. మూడు గదుల్లో, వంటింట్లో, వరండాలో, నూతిలో — అంతా నిశ్శబ్దం. అడిగినా చెప్పనని మౌనం!

"సుబ్బులూ" — మరోసారి ఏడ్చాడు.

టేబుల్ మీద కాగితం జాలి తలని కిందకొచ్చింది.

ఛప్పున ఎత్తి కంగారుగా చదివాడు:

చేతుల్లోంచి కాగితం జారిపోయింది.

గోలపెట్టి, ఒక్క వూపున పరుగెత్తాడు,

"నన్ను క్షమించు సుబ్బులూ — నన్ను అన్యాయం చెయ్యకు సుబ్బులూ—" అంటూ గోదావరి వేపు.

బయట చిక్కని చీకటి.

***